క్లుప్తంగా

ఓటుతోనే సమాన గౌరవం

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవిందర్



మాట్లాడుతున్న రవిందర్

బొంరాస్‌పేట: ఓటుహక్కుతోనే మహిళలకు సమాజంలో సమాన గౌరవం దక్కిందని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవిందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘాలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాన గౌరవం కోసం రాజ్యాంగం కల్పించిన ఓటును మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, ఐకేపీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లోనే కొలువులు



పార్టీలో చేరిన వారితో మాజీమంత్రి

ధారూరు: ధారూరు మండలం లక్ష్మీనగర్‌తండా గిరిజన నిరుద్యోగ యువకులు వికారాబాద్‌లోని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మాజీమంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఉద్యోగ నియామకాలు చేపడతామని చెప్పారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి



పాఠ్యప్రణాళిక వివరిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: సులభతరమైన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలని ముజాహిద్‌పూర్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలలో క్లస్టర్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్థమయ్యే రీతిలో బోధన చేస్తే.. విద్యార్థులకు పాఠాలు అవగతం అవుతాయని చెప్పారు. బోధనా అనంతరం విద్యార్థులను అడిగి తెలుసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోధ్యాయుడు వెంకటయ్య, సీఆర్పీ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'రవీంద్రభారతి'లో దీపావళి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో దీపాలు వెలిగించి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్ మాట్లాడుతూ జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల పండుగే దీపావళి అని చెప్పారు.

గజానికో గుంత..

బండి నడిపేందుకు తంటా

- అస్తవ్యస్తంగా రహదారులు
- దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోని వైనం



పూర్తిగా ధ్వంసమైన దోర్నాల్ గ్రామ రోడ్డు

ధారూరు: గజానికో గుంత ఏర్పడి, దశాబ్ద కాలంగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోక పోవడంతో ఆ బీటీరోడ్లు వాహనచోదకులకు చుక్కలు చూపెడుతున్నాయి. ధారూరు మండలం స్టేషన్ ధారూరు–నాగారం వయా దోర్నాల్ రోడ్డు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రీబీటి వేసి పునర్నిర్మించారు. ఆ తురువాతి కాలంలో ఎవరూ పట్టించుకోక పోవడంతో పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్ల దుస్థితి గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గట్టెపల్లి వరకు, గట్టెపల్లి నుంచి రుద్రారం వరకు, ధారూరు మండల పరిషత్ నుంచి చింతకుంట రోడ్డు, మోమిన్ ఖుర్దు నుంచి రాజాపూర్ రోడ్డు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి అల్లిపూర్ వరకు, గడ్డమీది గంగారం నుంచి నర్సాపూర్ వరకు రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఈ రహదారులను పునర్నిర్మాణం చేయటమో, లేక మరమ్మతులు చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పెద్ద కయ్యలు..



గుంతలను చూపిస్తున్న స్థానికులు

దోమ: గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడటమే కాకుండా.. రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్లకు కయ్యలు పడ్డాయి. దోమ మండలం గూడూర్ గ్రామ శివారులో మూజాహిద్‌పూర్ వైపునకు వెళ్లే ప్రధాన బీటీరోడ్డు మొన్నటి వర్షానికి తెగిపోయింది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



తాండూరు డిపో మేనేజర్ సమత

తాండూరు టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు హైదరాబాద్ నుంచి నడపనున్నట్లు తాండూరు డిపో మేనేజర్ సమత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని వేములవాడ, కాళేశ్వరం, రామప్ప గుడి, వేయి స్తంభాల గుడి, పాలకుర్తి సోమనాథాలయానికి ప్రతి ఆదివారం, కార్తీక పౌర్ణమి ముందు రోజు మధ్యాహ్నం 2 గంటలకు బస్సులు హైదరాబాద్ నుంచి బయలు దేరతాయని, అనంతరం తిరిగి సోమవారం రాత్రికి నగరానికి చేరుకుంటాయని ఆమె పేర్కొన్నారు.

ఛార్జీలు ఇలా..

రాజధాని సర్వీస్‌కు రూ.2,400, సూపర్ లగ్జరీకి రూ.1,900, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1500లు టికెట్ ధర ఉంటుందన్నారు. అలాగే ఏపీలోని అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు కార్తీక మాసం ప్రతి ఆదివారం, పౌర్ణమి ముందు రోజు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నుంచి బయలు దేరి, దర్శనానంతరం మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బస్సులు చేరుకుంటాయన్నారు. రాజధాని సర్వీస్‌కు రూ.4వేలు, సూపర్ లగ్జరీకి రూ.3,200ల టికెట్ ఛార్జీలు ఉంటాయన్నారు. అయితే దర్శనం టికెట్లు, స్నాన వసతి కొరకు బయలుదేరే ముందు బస్సులోనే రూ.550 చెల్లించాల్సి ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలానికి కూడా రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడపనున్నట్లు డీఎం వెల్లడించారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి

కేశంపేట: కెనరా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కేశంపేట సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అన్నారు. కేశంపేటలో శుక్రవారం కెనరా బ్యాంక్ చీఫ్ మెనేజర్ విజయ్‌కుమార్‌తో కలిసి గ్రామ సర్పంచ్ వెంకట్‌రెడ్డి బ్యాంక్ ఏటీఎంను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యం కోసమే ఏటీఎంను ఏర్పాటు చేశారని తెలిపారు. బ్యాంక్ సిబ్బంది శ్రీహరి, వీరేశ్, గ్రామస్తులు రమేష్‌గౌడ్, శ్రీనివాసులు గుప్తా, ధవరెడ్డి, వెంకటయ్య, రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఏటీఎంను ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి

రానున్నది 'హస్తం' ప్రభుత్వమే



కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీఆర్ఆర్

- బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబానికే లబ్ధి
- ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులు
- పరిగి అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం కల్మన్‌కాల్వ, కొత్తపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందని, నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. ప్రజలు బీఆర్ఎస్ మోసపూరిత మాటలను నమ్మకుండా.. కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ చౌడాపూర్ మండలం అధ్యక్షుడు అశోక్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహా నాయక్, నాయకు లు నర్సింహులు, రాములు పాల్గొన్నారు.

సీతాఫలం.. ఉపాధికి ఊతం

ప్రధాన రహదారుల పక్కన విక్రయాలు



సీతాఫలాలను విక్రయిస్తున్న వ్యాపారులు

పెద్దేముల్: సీజనల్ పండ్లలో ఒకటి సీతాఫలం. ఈ పండ్లు ఎక్కువగా శీతాకాలంలోనే లభిస్తాయి. పేదోడి యాపిల్‌గా పేరుగాంచిన ఈ ఫలాల విక్రయంతో.. ఈ కాలంలో ఎంతోమందికి ఉపాధి దొరుకుతుంది. మండల పరిధి దుగ్గాపూర్, మన్‌సాన్‌పల్లి, తట్టెపల్లి, మారేపల్లితండా, రుక్మాపూర్, కొండాపూర్ తదితర గ్రామాల ప్రజలు దినచర్యగా మధుర ఫలాలను అమ్ముతూ లబ్ధిపొందుతున్నామని చెప్పారు. సెప్టెంబర్ మాసం నుంచి నవంబర్ వరకు విరివిగా లభ్యమయ్యే ఫలాలను తాండూరు–హైదరాబాద్, జహీరాబాద్–తాండూరు, సంగారెడ్డి–తాండూరు ప్రధాన రాహదారులపై జోరుగా విక్రయిస్తుంటారు. తద్వారా రోజుకు రూ.500 నుంచి 800 వరకు లాభం చేకూరుతుందని విక్రయదారులు తెలిపారు. రోజూ ఉదయం 6గంటలకు అడవుల్లోకి వెళ్లి కాయలు సేకరించి, 10గంటల నుంచి అమ్ముతుంటామని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

- ఇంటింటికీ లబ్ధి చేకూర్చిన సీఎం
- తెలంగాణలో మరోసారి అధికారం మాదే
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



బొంరాస్‌పేట: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

పరిగి: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని పరిగి అసెంబ్లీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి మండలం యాబాజిగూడ, తొండుపల్లి, రావుపల్లి, చిట్యాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ ఫలాలను అందజేస్తున్న ప్రభుత్వం మనదేనన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను తీసుకువచ్చి, పేదలకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజలు కాంగ్రెస్ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు సముచిత స్థానం



పరిగి: అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: సబ్బండ వర్గాలకు బీఆర్ఎస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు బాలముకుందం ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, చౌడాపూర్ మండలం అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, రమేష్, కృష్ణయ్య, శ్రీను, వెంకటయ్య ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీపీ అరుణరాజప్ప, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

బొంరాస్‌పేట: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో దుద్యాల మండలం నాజ్‌ఖాన్‌పల్లికి చెందిన 45మంది, బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన విద్యార్థిసంఘం నాయకులు విజయ్‌కుమార్‌గౌడ్, పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వైస్ ఎంపీపీ శ్రావణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

కాంగ్రెస్ కంచుకోట తాండూరు

- బద్దలు కొట్టడం ఎవరితరం కాదు
- పార్టీని ఆదరిస్తున్న ప్రజలు
- ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- బీఆర్ఎస్ నుంచి పెరుగుతున్న వలసలు



యాలాల: అన్నసాగర్ నుంచి భారీగా నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు: కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న తాండూరును బద్దలు కొట్టడం ఎవరితరం కాదని డీసీసీబీ చైర్మన్, పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వేలాది మంది పార్టీ కార్యకర్తలతో ర్యాలీగా.. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునిత, ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మనోహర్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తాండూరులో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని, తనకు మద్దతు పలికేందుకు ఉప్పెనలా రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో వెళ్లారని, ఆయన పార్టీ మారిన నాటి నుంచి ఇక్కడ రాక్షస పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇక రోహిత్‌కు తాండూరులో కాలం చెల్లిందన్నారు. డిసెంబర్ 3న బ్యాలెట్ బాక్సులు బద్దలయ్యే విధంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించి, ఎమ్మెల్యేను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని జోస్యం చెప్పారు.

బీఎమ్మార్‌దే విజయం

యాలాల: డీసీసీబీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి విజయం ఖాయమని యాలాల మండల నేతలు ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, కురుమ సంఘం మండల అధ్యక్షుడు మహిపాల్, సీనియర్ నేతలు కోలుకుంది హన్మంతు, అన్నసాగర్ సత్యనారాయణ రెడ్డి, రఘురాంరెడ్డి, వాసిద్ ఖాన్‌ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి భారీగా తాండూరుకు కదిలారు. బీఎమ్మార్‌తో కలిసి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు.



యాలాల: కాంగ్రెస్‌లో చేరిన ముద్దాయిపేట బీఆర్ఎస్ ఎరుకలి సంఘం నాయకులు

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి

ముద్దాయిపేట ఎరుకలి సంఘానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎరుకలి శ్రీనివాస్, మాస వెంకటయ్య, నరేష్, సురేష్, చిన్న వెంకటయ్య, రాజు, రాములు, లాలప్ప, శ్రీకాంత్, పెద్దింటి వెంకటప్ప ఉన్నారు.



తాండూరు: ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బీఎంఆర్, ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్

బీఆర్ఎస్‌కు షాక్

తాండూరు రూరల్: అధికార పార్టీ బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ తన సతీమణి ఎంపీపీ అనితాగౌడ్‌తో కలిసి ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ రవిగౌడ్

అయ్యప్ప దీక్షతో మోక్షం

చన్నీటి స్నానం ఒంటి పూట భోజనం

- ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుంది
- ఏటా పెరుగుతున్న భక్తులు



పడిపూజ చేస్తున్న సతీశ్‌నాయర్ గురుస్వామి (ఫైల్)

షాబాద్: అయ్యప్ప స్వామి దీక్ష అందరికీ మోక్షదాయకం. స్వామియే శరణం.. అంటూ శరణు ఘోష.. అయ్యప్ప నామ స్మరణ శుభదాయకం. పదునెనిమిది మెట్లను పరమభక్తితో తరించిన వారికి జన్మ ధన్యం అవుతుంది. అయ్యప్ప నామ స్మరణతో మొదలు దీక్షా ప్రారంభం కాగా.. మాల ధరించిన వారు కఠోర బ్రహ్మచర్యాన్ని అవలంభిస్తుంటారు. ఈ దీక్షతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతందని భక్తుల విశ్వాసం. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షను స్వీకరిస్తుంటారు. ఎక్కువగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు మాల వేసుకుంటారు. ఈ మాసంలో నిర్వహించే పూజలకు ఎంతో విశిష్టత ఉంటుంది. ఉదయం, సంధ్యావేళల్లో, చన్నీటి స్నానం, ఒంటిపూట భోజనం కటిక నేలపై నిద్రించడం వంటి చర్యలతో ఆరోగ్యంగా ఉండొచ్చు. మాలధారణ చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులను సైతం మాత, స్వామి అంటూ పిలవాల్సి ఉంటుంది. అయ్యప్ప మాలధారణ చేయించే గురుస్వామిని భక్తితో పూజించాలి. షాబాద్ మండలంలో ఈ ఏడాది దాదాపు వెయ్యి మందికి పైగా మాల ధరించనున్నట్లు సమాచారం.

దీక్షతో కలిగే ఫలితాలు..

అయ్యప్ప దీక్ష స్వీకరించడం వలన సమాజంలో కులమత బేధాలు, పేద, ధనిక తారతమ్యాలు కనిపించవు. ఉపవాసం ఉండడంతో జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి లభిస్తుంది. రక్తం, జీర్ణవ్యవస్థ శుద్ధి అవుతాయి. శరీరంలో స్థాయికి మించిన కొవ్వు ఉంటే కరిగిపోతుంది. ఏకాగ్రతను పెంచుతుంది. గంధం, కుంకుమ, విభూతి, తులసిమాల ధరించడం వలన నాడి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. సామూహిక పూజలు, భజనలతో మానసిక రోగాలు తొలగిపోతాయి. పూజా సమయంలో గంటల శబ్దాలవలన శరీరంలోని అవయవాలకు నూతనోత్సాహం లభిస్తుంది. దురలవాట్లకు దూరమై భక్తి భావాలు పెరుగుతాయి.

స్వాములకు పేర్లు..

తొలిసారి మాలధరిస్తే కన్యస్వామి, రెండోసారి కత్తిస్వామి, మూడోసారి గంటస్వామి, నాలుగోసారి గదస్వామి, ఐదోసారి పెరుస్వామి, ఆరోసారి గురుస్వామి, ఏడు అంతకన్న ఎక్కువసార్లు పెరు గురుస్వాములని, 18 సార్లు, అంతకన్న ఎక్కువసార్లు మాల ధరిస్తే నారికేళస్వాములని సంబోధిస్తారు.

మధురానుభూతి

అయ్యప్పస్వామిని స్మరిస్తూ ఆయన సేవలో గడపడం మధురానుభూతిని కలిగిస్తుంది. 20 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా అయ్యప్ప మాల ధరించి దీక్ష తీసుకుంటున్నాను. ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆర్థికంగా కలిసి వస్తుండడంతో అయ్యప్పస్వామి దర్శన భాగ్యమేనని విశ్వసిస్తున్నా.

– దర్పల్లి రవీందర్‌గౌడ్, గురుస్వామి, షాబాద్

ఆరోగ్యానికి మేలు..

అయ్యప్ప మాలధారణ నియమ నిష్టలతో కూడుకొని ఉంటుంది. దీంతో మనుసుకు ప్రశాంతత లభిస్తుండడంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చు. సూర్యోదయం కన్న ముందు సూర్యాస్తమయం తరువాత రోజుకు రెండుసార్లు స్నానం చేయడం ఒకపూట భోజనంతో మానసికోల్లాసం పెరుగుతుంది.

– వెంకటేశ్, గురుస్వామి, నాగర్‌గూడ

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

ఎమ్మార్పీస్ జిల్లా కార్యదర్శి శివశంకర్

చేవెళ్ల: హైదరాబాద్ పరేడ్ మైదానంలో శనివారం నిర్వహించనున్న మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభను విజవయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భానుప్రసాద్‌లు అన్నారు. ఈ మేరకు చేవెళ్లలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. వర్గీకరణ కోసం చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు.